శీల పరీక్షలో
భార్య
శీలవతిగా
రుజువయికూడా
అతను ఎందుకు
సంతోష పడలేదు?

కె.వి.వి
సత్యనారాయణ
రాజు
కథ

# యుగధర్మం

"నువ్వా అమ్మాయిన్చేసుకోవడానికి వీల్లేదు" గట్టిగా అరిచాడు రంగరాజు.

అప్పటికి సుమారు గంటసేపట్నుంచి తండ్రి నొప్పించేందుకు శత విధాలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు చంద్రశేఖర్.

నెలరోజుల క్రితం బంధువుల పెళ్ళికి వెళ్ళి పెళ్ళిపందిట్లో ముద్దమందారంలా, అక్కడున్న ఆడవాళ్ళనందర్నీ తలదన్నే అద్భుత సౌందర్యంతో వెలిగిపోతున్న ఓ పద్దెనిమిదేళ్ళ పడుచును చూసి మనసు పారేసుకున్నాడతడు.

ఆ పెళ్ళి పందిట్లో అతడు సేకరించిన వివరాల ప్రకారం ఆ అమ్మాయి కింకా పెళ్ళికాలేదు. ఏదో బీరకాయ పీచు చుట్టరికం ప్రకారం ఆ అమ్మాయతడికి మరదలవుతుంది.

ఇంటికి వెళ్ళగానే తల్లిదగ్గర కదలేశాడు విషయం. ఆవిడ నెమ్మదిగా వీలు చూసుకుని భర్త చెవిలో ఊదింది ఓ మధురక్షణాన. అప్పటినుంచి శివమెత్తినట్టు ఎగురుతున్నాడాయన.

"ఇవ్వాళ తాడోపేడో తేల్చుకోవాల"ని కొడుకు పట్టుబట్టడంతో రంగరాజు ఆవేశానికి అంతులేకుండా పోయింది.

అందరు తండ్రుల్లాగే కారణం చెప్పకుండా, 'నువ్వా పిల్లను చేసుకోవడం నాకిష్టం లేద'ని ప్రారంభించి, కొడుకు నిలదీసి కారణం అడగ్గానే రెచ్చిపోయి ఆపోన్ని చంపుకోలేక, 'కారణాలు నీకనవసరం!' అని ఓ అరగంట కొడుకును తిట్టి, చివ[illegible] కారణం చెప్పందే అతణ్ని ఒప్పించ[illegible] సాధ్యం కాదని గ్రహించి, "ఏరా నాకు [illegible]



లేదనుకున్నావా నువ్విష్టపడిన పిల్లను కాదనడానికి? ఆ అమ్మాయి మొహం తప్ప దాని వంశ చరిత్రేమైనా తెలుసా నీకు?

దాని అత్త మొగుణ్ణొదిలేసి పక్కింటి కుర్రాడితో కాలక్షేపం చేస్తోంది. ఆ పిల్ల పెద్దక్క, మొగుడుండగానే ఎదురింటి వాడితో కులుకుతోంది. అటువంటి వాతావరణంలో పెరిగిన ఆ పిల్ల ఇప్పటికెన్ని చేతులు

మారిందో ఎవడికి తెలుసు?" అన్నాడు రంగరాజు.

చంద్రశేఖర్ తండ్రి మొహంలోకి చూస్తూ అన్నాడు. "ఆ అమ్మాయి బంధువుల నడవడిక మనకనవసరం. అయినా ఆ విషయాలు ఎవరో చెపితే మీరు విన్నారు తప్ప, కళ్ళారా చూడలేదు కదా?

ఒకోసారి మన కళ్ళే మనల్ని మోసం చేస్తాయి. అటువంటప్పుడు ఆ అమ్మాయి శీలం గురించి [illegible] పడటంలో ఏమైనా అర్థం ఉందా?"

"నోర్ముయ్, నీతో చెప్పించుకోవాల్సిన అగత్యం నాకు లేదు" హుంకరించాడు రంగరాజు.

"సరే... మీతో నాకు వాదనెందుకు? ఆ అమ్మాయిని నేను ఇష్టపడుతున్నాను. మీ కిష్టమైతే పెళ్ళి జరిపించండి లేదా నేనే ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను. నేనెలాగూ ఉద్యోగస్తుణ్ణే గనుక మీ మీద ఆధారపడాల్సిన అవసరం నాకు లేదు"

కొడుకలా తెగేసినట్టు మాట్లాడ్డంతో, పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలు గుర్తొచ్చి దిగి వచ్చాడు రంగరాజు. "ఒరేయ్ నాన్నా... భార్యా రూపవతీ శత్రుః అన్నారు. నా మాట వినరా" అన్నాడు అనునయంగా.

చంద్రశేఖర్‌కు నవ్వొచ్చింది. నవ్వితే తండ్రి చిన్నబుచ్చుకుంటాడని భావించి నవ్వు నదిమిపెట్టుకుంటూ అన్నాడు— "బహుశః ఆ మాటన్నవాడి పెళ్ళాం కురూపి అయి ఉంటుంది. తనకు దక్కని అదృష్టం మరొకడి కెందుకు దక్కాలని అలా అనుంటాడు. ఇప్పుడదంతా ఎందుకు? పెళ్ళి ముహూర్తాలు పెట్టించే ఏర్పాట్లు చేయండి"

* * *

మైథిలితో పెళ్ళి జరిగి అయిదేళ్ళు గడిచినా— అప్పట్లో తన పెళ్ళి విషయంలో తండ్రితో జరిగిన వాగ్వివాదాన్నేనాడూ మరచిపోలేదు చంద్రశేఖర్. మొదట్లో తండ్రిమీద తను సాధించిన విజయానికి గుర్తుగా ఆ సంఘటనను పదేపదే గుర్తు తెచ్చుకున్నా క్రమంగా అతడలా గుర్తు చేసుకోవడానికి గల కారణం మారింది.

తండ్రి తను చేసుకుంటానన్న అమ్మాయి శీలాన్ని శంకించినప్పుడు ఆ అమ్మాయి మీది మోహంతో అప్పట్లో తండ్రివాదన అసంబద్ధంగా, అన్యాయంగా అనిపించినా, కాలక్రమేణా దాంపత్యంలో కొన్ని వసంతాలు గడిచాక ఆనాడు తండ్రి చెప్పిన మాటల్లో నిజమెంత? అని బేరీజు వేయసాగిందతడి మనసు. వయసు పెరిగే కొలదీ మనిషి మనసు కలుషితమవుతుందనేనా పిల్లల్ని దేవుళ్ళతో పోలుస్తారు?!

పెళ్ళయ్యాక ఉద్యోగరీత్యా స్వరాష్ట్రాన్ని వదిలి దేశపు సరిహద్దుల్లో పని చేయడం, ఆ విధంగా భార్యకు దూరంగా ఎక్కువ రోజులు గడపవలసి రావడం, అతడిలో నాటుకున్న అనుమానపు బీజం మొలకెత్తడానికి సహకరించాయి. అందమైన భార్య భర్తకు శత్రువనే నానుడి నిజంగా నిజమేనా? ప్రతిరోజూ ఇదే విషయమై ఆలోచిస్తుండేవాడు చంద్రశేఖర్.

తననేరి కోరి చేసుకున్న భర్త భగవంతుడితో సమానం మైథిలికి. పెళ్ళిగాకముందు తను పూజించే దేవుళ్ళ ఫోటోలన్నీ పుట్టింట్లోనే వదిలేసి భర్తతో కాపురానికొచ్చాక ప్రతిరోజూ అతడి కాళ్ళకు దణ్ణంపెట్టుకొని మంగళసూత్రాలు కళ్ళకద్దుకోవడం— పతియే ప్రత్యక్ష దైవమనే ఉవాచను ఆమెనమ్ముతుందనడానికి ప్రత్యక్ష నిదర్శనమది చెప్పుకోవచ్చు.

అత్తమామలు తనను సూటిపోటి మాటలంటున్నా ఆమె పట్టించుకునేది కాదు. తన భర్తొక్కడూ తనను ప్రేమగా చూసుకొంటే చాలనుకొనేది. భర్త తనొదిలి వేరే ఊరు వెళితే విలవిల్లాడేదామె మనసు.

భార్య తనమీద కురిపించే అవ్యాజమైన అనురాగం మరోలా అర్థమయ్యేదతడికి. తను ఒకటి రెండు రోజులు ఊరువిడిచి వెళితేనే ఇంతగా బాధపడుతుందే! తను ఉద్యోగ రీత్యా నెలల తరబడి వేరే చోట ఉన్నప్పుడెలా భరించగలుగుతోంది మైథిలి? ఆమె మనసులో ఏముందో తెలుసుకోవడమెలా?

* * *


"బావున్నారా?" అంటూ ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తిని చూసి నవ్వుముఖంతో తలూపింది మైథిలి.

అతడు భర్త స్నేహితుడు చక్రధర్. అదే ఊళ్ళో ఉద్యోగం చేస్తున్నాడతడు. భర్త కోసం తరచూ తమింటికి రావడం అతడి కలవాటేనని మైథిలికి తెలుసు. తన భర్త ఏ సమయంలో ఎక్కడుంటాడో తనకంటే చక్రధర్‌కే బాగా తెలుసునని మైథిలి నమ్మకం.

మైథిలివైపు చూస్తూ కుర్చీలో కూర్చుని అన్నాడు చక్రధర్. "చంద్రం దగ్గర్నుంచి ఉత్తరాలొస్తున్నాయా?"

"ఆ నిన్ననే ఓ ఉత్తరం వచ్చింది. నేనే డ్యూ ఆయనకు" నవ్వుతూ అంది మైథిలి.

చక్రధర్ నిట్టూర్చి అన్నాడు— "మీరిద్దరూ ఇలా ఉత్తరాలు రాసుకోవ



డమేనా? ఇద్దరూ కలిసి ఒకచోట ఉండేదేమైనా ఉందా?"

తమ శ్రేయోభిలాషిగా, భర్త స్నేహితుడిగా అతడన్న మాటల్లో గూడార్థం ఏమీ ధ్వనించలేదామెకు.

"మీకు తెలుసుకదా? నేను కొత్తగా చెప్పేదేముంది?" అంది మైథిలి.

"నాకెలాగూ తెలుసు. కానీ నాకు తెలిసింది మీకింకా తెలియలేదనే నా బాధ" అన్నాడు చంద్రశేఖర్.

అతడి మాటల్లోని మెలిక ఓ పట్టాన అర్థం కాలేదామెకు.

ఆమె మొహంలోని ప్రశ్నార్థకం తేలిగ్గానే కనిపించిందతడికి.

"నేనిలా చెప్తున్నానని మరోలా భావించవద్దు. వాడు నా స్నేహితుడైనా ఈ విషయంలో మీకన్యాయం చేస్తున్నందుకు నాకెంతో బాధగా ఉంది. మీతో పెళ్ళిగాకముందునించీ వాడికి తిరుగుళ్ళు అలవాటే! నాకు తెల్సి నలుగురైదుగురు అమ్మాయిలతో పరిచయం ఉంది వాడికి.

పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకల్తో గానీ పోవన్న విషయం మీకు తెలియంది కాదు కదా? మీ మీద మోజు పోయి, వాడు కావాలనే మీకు దూరంగా ఉంటూ వాడి సరదాలు తీర్చుకుంటున్నాడని నా అనుమానం. ఈ మధ్యనే నాకో విషయం తెలిసింది.

వాడికీ రాష్ట్రం ట్రాన్స్‌ఫర్ అయినా కేన్సిల్ చేయించుకున్నాడని తెలిసింది. అంతేకాదు, ఇటీవల తనతో పనిచేసే అమ్మాయితో బాగా చనువుగా ఉంటున్నాడని, అదే ఊళ్ళో పనిచేస్తున్న నా మిత్రుడొకడు ఉత్తరం వ్రాశాడు. చూస్తారా?" అంటూ జేబులో చెయ్యిపెట్టబోయాడు చక్రధర్.

చక్రధర్ తన స్నేహితుడి గురించి అబద్ధాలు చెపుతాడనే అనుమానమెంత మాత్రమూ లేదామెకు. కానీ ఇతడిలా ఎందుకు చెప్తున్నాడు? ఒకవేళ తన భర్త నిజంగా తిరుగుబోతే అయితే అతడి స్నేహితుడిగా అతడిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేయకుండా, ఆ విషయాలన్నీ యథాతథంగా తనతో చెప్పడంద్వారా తననుంచి ఏం అభిలషిస్తున్నాడితడు?!

'నేను ప్రయత్నించి మిత్రుణ్ణి మార్చలేకపోయానని, మీరైనా జాగ్రత్తపడి మీ సంసారాన్ని దిద్దుకోవడానికి ప్రయత్నించండి' అని చెప్పడమా అది? లేక...

"నా మాటలమీద నమ్మకం లేదు కదా మీకు? ఈ ఉత్తరం చదవండి మీకే తెలుస్తుంది" అంటూ జేబులోంచి మడతపెట్టబడిన కాగితాన్ని బయటకు తీశాడు చక్రధర్.

రుజువులతో సహా తనను నమ్మించాలని వచ్చిన అతణ్ణనుమానించలేకపోయింది మైథిలి. "వద్దులెండి. నేనేమీ చూడనక్కర్లేదు. మీరబద్ధం ఎందుకు చెపుతారు?" అంది.

చక్రధర్ నవ్వి అన్నాడు, "వాడిన్ని వేషాలు వేస్తున్నాడని తెలిసికూడా మీరింత నిబ్బరంగా ఎలా ఉండగలుగుతున్నారో తలచుకొంటనే ఎంతో ఆశ్చర్యంగా ఉంది

నాకు!''

మైథిలి తలెత్తి అతడివైపు చూసింది. అంతవరకూ ఆమె చూడని భావమేదో కదలాడిందతడి కళ్ళలో.

''నిజంగా మిమ్మల్నభినందిస్తున్నాను''

అతడి అభినందనకు సంతోషించాలో, తన స్థితికి బాధపడాలో అర్థం కాలేదామెకా సమయంలో.

''పైకి మీరు నిబ్బరంగా ఉన్నా లోలోపల బాధపడుతున్నారని నిస్సందేహంగా చెప్పగలను. అందుకు సాక్ష్యం బరువుగా వాలిన మీ కనురెప్పలే!'' అన్నాడు చక్రధర్ తిరిగి.

మైథిలి మాట్లాడకపోవడం చూసి తిరిగి అన్నాడతడు. ''మనిషికి తను చేసిన తప్పుకు శిక్షపడాలి. శిక్షించే అవకాశం మనకులేనప్పుడు మన సుఖం మనం వెదుక్కోవడంలో తప్పులేదు''

నివ్వున తలెత్తి చూసింది మైథిలి. చక్రధర్‌లోని మగవాడర్థమయ్యాడామెకు.

''ఇంత వివరంగా చెప్పినా అర్థం కానట్టుగా మీరు చూస్తుంటే, మీకేవిధంగా చెప్పాలో అర్థం కావడం లేదు నాకు''

మైథిలి కళ్ళలోకి ఆవేశం తన్నుకొచ్చింది. ''అంటే ఆయనకు లేని పట్టింపు నాకెందుకుండాలనేగా మీ భావం! మీరు నా భర్త స్నేహితుడు కాబట్టి బ్రతికిపోయారు. ఇంకెప్పుడూ ఇటువంటి వెర్రిమొర్రి వేషాలేయకండి. మీ సంగతి రేపే ఆయనకు ఉత్తరం వ్రాస్తాను. తక్షణం కదలండి బయటకు'' గుమ్మంవైపు చూపిస్తూ రౌద్రంగా అంది మైథిలి.

మరో మాట మాట్లాడకుండా పరుగులాంటి నడకతో బయటపడ్డాడు చక్రధర్.

* * *

''డియర్ చక్రధర్,

నీ ఉత్తరం అందింది. రెండ్రోజుల క్రితమే మైథిలి దగ్గర్నుంచి కూడా ఉత్తరం వచ్చింది. నిన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా వ్రాసింది. పాపం అసలు విషయం తనకేం తెలుసు?

ఏది ఏమైనా నాకెంతో సంతోషంగా ఉంది. మైథిలిమీద ఏ మూలో ఉన్న అనుమానం ఈ సంఘటనతో



## దూరం

కోర్టులో సాక్ష్యం చెప్తున్నాడు సుబ్బారావు.

''మీరు గంగులు హత్య చెయ్యడం ఎంత దూరం నించి చూశారు?'' అడిగాడు లాయరు.

''ఓ మైలు దూరం నించి'' చెప్పాడు సుబ్బారావు.

''అంత దూరం నుంచి ఎలా చూడగలిగావు?''

''భలేవారే సార్? కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో వున్నాడంటారు సూర్యుడు! మనం రోజూ చూడ్డంలే'' నవ్వుతూ చెప్పాడు సుబ్బారావు.

వై.వి.రమణ (సిరాం)

సమసిపోయింది. స్నేహితుడిగా, నా మనసులోని అనుమానాన్ని పార(దోలడానికి నువ్వు చేసిన సహాయం మరువలేనిది. నా సూచన ప్రకారం మా ఇంటికి వెళ్ళి మైథిలి మనసు పాడుచేయాలన్న నీ ప్రయత్నం బెడిసికొట్టడమే కాకుండా తన మనసులో ఉన్న ఊహలు తెలుసుకునేందుకు తోడ్పడింది.

ఈ జన్మకే కాదు, మరేజన్మకైనా మైథిలే నా భార్య కావాలని కోరుకుంటున్నాను. తన భర్త తిరుగుబోతని తెలిసినా చలించని ఆడవాళ్ళు వేళ్ళమీద మాత్రే లెక్కపెట్టగలిగేటంతమంది ఉంటారని నువ్వూ ఒప్పుకుంటావని భావిస్తున్నాను.

అటువంటి కొద్దిమందిలో ఒక వ్యక్తి నా భార్య— అని తలుచుకొంటేనే ఎంతో సంతోషంగా ఉంది నాకు. నీ సహకారానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నీ చంద్రశేఖర్''

తమింటికి అతడు మళ్ళీ వచ్చినందుకు తను కోపగించుకున్నా లెక్క చేయకుండా బలవంతంగా తన చేతిలో చక్రధర్ ఉంచిన ఉత్తరాన్ని చదువుకున్న మైథిలి దేహం అగ్నిజ్వాలల్లో మండుతున్నట్టుగా అయింది.

ఆ రోజు— తనలా ప్రవర్తించడం వెనుక దురుద్దేశమేమీ లేదనీ, మిత్రుడి కోరిక మేరకు మాత్రమే తనలా ప్రవర్తించాల్సి వచ్చిందనే విషయాన్ని తెలియజేసేటందుకు ఆ ఉత్తరాన్నామెకు చూపించాడు చక్రధర్.

కానీ ఆ ఉత్తరం చదివిన మైథిలి అతడూహించని విధంగా రియాక్ట్ అయింది. తీక్షణంగా చక్రధర్ వైపు చూసింది.

అతడి కళ్ళలో— ''నామీద మీకున్న దురభిప్రాయం పోయిందా?'' అనే భావన కదలాడింది.

మరుక్షణం ఓ నిశ్చయానికొచ్చి అందామె— ''స్నేహధర్మం బాగానే నెరవేర్చారు మీరు. కానీ నేనూ మనిషినే అని, నాకూ ఆత్మాభిమానం ఉంటుందనీ ఎన్నడైనా ఆలోచించారా?''

చక్రధర్ తికమకపడ్డాడు.

అతడెంత మాత్రమూ ఎదురుచూడని పరిస్థితి అది! తను చెప్పిన విషయం విన్నాక, తనను తప్పుగా అర్థం చేసుకున్నందుకు క్షమించమంటుందనీ, అప్పుడు దరహాసం చిలికించుదామనీ అనుకున్న అతడికామెనుంచి ఎదురుచూడని ప్రశ్న రావడంతో ఏం మాట్లాడాలో తెలియలేదు.

మైథిలి నిట్టూర్చి అంది ''నా వైపునుంచి ఆలోచిస్తే మీరీపని చేసేందుకు ముందుకొచ్చి ఉండేవారే కాదు. నా ప్రశ్నకు మీరెలాగూ సమాధానం చెప్పలేరు. కనీసం నేను చెప్పేదైనా జాగ్రత్తగా వినండి.

నా శీలాన్ని పరీక్షించడం కోసం ఆయన అవలంబించిన విధానం నాకాయన మీద అంతులేని అసహ్యాన్ని కలుగజేస్తోంది. ఆయన్ని మనసా, వాచా ప్రేమించి, ఆరాధించే నన్ను ఈ విధంగా అనుమానించి, అవమానించినందుకు నా మనసు పూర్తిగా విరిగిపోయింది. విరిగిన మనసుతో ఆయనతో కాపురం చేసేందుకు నేనెంత మాత్రమూ సిద్ధంగా లేను.

రామాయణం జరిగిందో లేదో మనకు

తెలియదు. అది జరిగిందని మనమనుకుంటే— సీతాదేవి భర్త పరీక్షకు తట్టుకొని నిలబడి ఆనాటి స్త్రీ లోకానికి ఆదర్శనారీ రత్నం అయింది.

నీతులూ, ఆదర్శాలూ కాలానుగుణంగా మారుతుంటాయి కదా? ఈ కాలం నీతి ఏమిటంటే— భర్త, భార్య శీలాన్ని అనుమానించినా, ఆమె ఆత్మగౌరవాన్ని కించపరిచినా, దానికి ప్రతిగా స్పందించడం.

నేనెంతగానో ఆరాధించిన నా భర్త, నా శీలాన్ని శంకించడమూ, ఆయన అనుమానం తీర్చుకుందుకు అవలంభించిన విధానమూ నా ఆత్మగౌరవాన్నీ, అభిమానాన్నీ దెబ్బతీశాయి.

అందుకే ఆయనకు విడాకులివ్వడానికి నిశ్చయించుకున్నాను. ఈ సందర్భంగా మీకో సలహా ఇవ్వదలచుకున్నాను.

మీరాయన శ్రేయోభిలాషి కనుక, మీ స్నేహితుడి పరీక్షలకు తట్టుకోని నిలబడగలిగే మహాసాధ్విని వెదికి మళ్ళీ పెళ్ళి చేయండి ఆయనకు.

ఎవరో ఒకరు దొరక్కపోరు— కలియుగంలో కూడా త్రేతాయుగపు ఆలోచనలున్న పతివ్రతా శిరోమణులు!''

ఆమె చెప్పింది విన్నాక, భార్య శీలాన్ని పరీక్షించడం కోసం తన స్నేహితుడు వేసిన పథకం, అందుకు తను సహకరించడంలోగల ఔచిత్యాన్ని గురించి మొదటిసారిగా ఆలోచించడం ప్రారంభించాడు చక్రధర్.

---



## పరిశోధనలకు ఉరి?!

ఈనాడు మనం ఇలా ఆధునిక జీవనాన్ని గడపటానికి మన ముందుతరాలకు చెందిన శాస్త్రవేత్తల నిస్వార్థ పరిశోధనలే మూలం! 1794లో ఫ్రెంచి విప్లవం సమయంలో ఆంథోని లారెంట్ లావోయిజర్ అనే ప్రముఖ రసాయన శాస్త్రవేత్తను ఆనాటి ప్రభుత్వం ఉరితీసింది! దానికి కారణం ఏమిటో తెలుసా? తాను చేయదల్చుకొన్న పరిశోధనలకు డబ్బులేక, కలెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగాన్ని చేపట్టి

అలా సంపాదించిన కష్టార్జితంతో పరిశోధనలు చెయ్యటమే! చూశారా? ఇది ఎంత దారుణమైన విషయమో? ఆనాటి మూఢనమ్మకాలతో బలి అయిన 'లావోయిజర్' మన మధ్య లేకపోయినా... ఈనాటి రసాయన శాస్త్రానికి ఆయన వేసిన పునాదులు మాత్రం పదిలంగా ఉన్నాయి!

జూపిటర్